# అపశ్రుతి

గంగానది కలకలస్వనాలతో గానంచేస్తూ చల్లగా సాగిపోతున్నది. మలయపవనుని బిగికౌగిటిలో కదలిపోతూ తరులతలు గలగల పాడుకున్నవి. ఆనందాన్ని అందిపుచ్చుకొంటూ పక్షులన్నీ పరవశంతో ఆలాపిస్తున్నవి. దిశదిశల నుండివచ్చి యీ మధురగానం నా హృదయాన్ని నింపివేస్తున్నది. కాని, నాహృదయంలో మాత్రం యేమూలో యేదో అపశ్రుతి. ఎంత మనోజ్ఞమైన రాగమైనా నాకు అపస్వరాలతో మిళితమౌతున్నది. తీయని పాట, తియ్యని మధువు నా కీజీవితంలో కరువైనవి. శూన్యాన్ని తిలకిస్తూ శూన్యానికై నిరీక్షిస్తూ యీ జీవితం యిట్లానే గడచిపోతుంది.

అమ్మ అంటుంది. 'చిరునవ్వులు వెదజల్లుతో అప్పుడే కన్ను తెరచిన పాపలాగ అప్పుడే విరిసిన పూవులాగ నిన్ను తిరిగి చూడగలనా యీ జన్మలో' అని. నేను తొలిసారి నవ్వినది—నాకు యింకా ప్రస్ఫుటంగా జ్ఞాపకమున్నది. అప్పుడే తొలిసారి నిద్రమేల్కొన్నాను. కండ్లయెదుట అతను—దూరాన్నుంచి నా కేసేచూస్తూ చిరునవ్వు నవ్వాడు. ఎంత ఆప్యాయంగా యెంత మనోహరంగా నవ్వుతాడు! కలత నిద్దురలో యిది కలా, నిజమా అనుకున్నాను. నాకు తెలియకుండానే నాపెదవులు నవ్వటానికి ప్రయత్నించినవి. అదే నేను మొదటిసారి నవ్వినది. ఆరోజు మొదలు మేము ప్రతిరోజూ చిరునవ్వులతోనే పలకరించుకుంటూవుండేవాళ్ళం.

ఒకరోజు ఒంటరిగా వుండగా అతను వచ్చాడు. అడగకుండానే 'నేను అంబర రాజకుమారుణ్ణి, నాపేరు చంద్రుడు' అన్నాడు. నేను బదులు పలుకలేదు. హృదయమంతా, శరీరమంతా ఆనందంతో నిండిపోయినప్పుడు మాటలెలా వస్తాయి? అతను దగ్గరగావచ్చి నా తల నిమిరాడు. వేరే యేమీ చేయలేనట్లు నా తల అతని గుండెల మీద వాల్చాను. అతని హృదయం నాకు ఆశ్రయమిచ్చినట్లు తోచినది. జీవితమంతా యిట్లాగే తలపెట్టుకొని నిద్రపోతాను ఇంకేమి కావాలనుకున్నాను. జీవితంలో వేరే కోరుకోదగిన దేమీలేనట్లే తోచినది.

అతను ప్రతిదినమూ వచ్చేవాడు. ప్రతిరోజు నన్ను తనతో రమ్మనేవాడు. 'కలూ, నాతోరావూ, నీవులేని జీవితం యెడారిలాగావుంది. కలూ, నీవు నా రాణివి, నా మందిరంలోనే వుండటానికి అర్హురాలివి, నా యింటికి యెప్పుడు వస్తావు?' ఇదే ధోరణి. ఆకాశంలో స్వేచ్ఛగా విహరించే విహంగంలాగ దిక్కు-దిక్కూ- చూచుకుంటూ పోయే అతనికి నా బాధ, బంధన మెట్లా అర్థమాతుంది! అమ్మ నన్ను కదలనిస్తుందా! మాలతీలత యేమంటుంది? మందారమాల నవ్వదూ! అందరూ కలువరాణి చంద్రునితో కలిసిపోయిందని అనుకోరూ! అప్పటికీ అమ్మతో అన్నాను. 'చంద్రుడు చాలా అందంగావుంటాడు కాదూ!' అని. 'అయ్యో! వెఱ్ఱితల్లీ! అంత పెద్దమచ్చ నీకు కనపడలేదు టే'అని నవ్వింది. మచ్చా! అవును, నిజమే, అతని నుదుటిమీద పెద్దమచ్చ. అయితే అది యిన్నాళ్లూ కనపడనేలేదే! మర్నాడు చంద్రుడు

వచ్చాడు. అతను వున్నంతసేపు ఆ మచ్చ జ్ఞప్తికిరానేలేదు. ఆశ్చర్యం! దూరంకాగానేమాత్రం ఆ మరక పెద్దదై భూమి అంతా ఆవరించుకొని నాఆశలన్నీ అణగద్రొక్కుతూ నన్ను దుఃఖంలో ముంచెత్తుతుంది. ఇది యెట్లా మరచిపోగలను. చివరకు అతనినే అడిగాను. 'ఎప్పుడూ నాతోటేవుంటే నీకు జ్ఞాపకం రానేరాదు రాణీ, నాతోరావూ' అన్నాడు. అదే నిజమనిపించింది. 'రోజూ నిద్రపోతూన్నా, మెలుకువతో వున్నా ప్రతినిమిషం నీతోటే వుండాలని వున్నది' అన్నాను. ఆరోజే అతనిదేశం వెళ్లిపోయినాము.

ఎంతోప్రేమతో అతను తన యింటికి తీసుకువెళ్లాడు. త్రోవపొడుగున మేఘబాలలు మాకు స్వాగతం ఇచ్చాయి. అతనిలాగా అతని అద్దాలమేడ యెంత అందంగావున్నది! అతనిలాగే అతనిని ఆశ్రయించినవన్నీ సుకుమారంగానే వున్నవి. ఆనందంలో ప్రపంచంలో దుఃఖంవున్నదన్నమాటే మరచిపోయినాను. బాహ్యప్రపంచానికి దూరంగా అతని యింటిలో అతనిలో కలిసిపోయివున్నాను. ఆ ఆనందం మత్తు కలిగించింది. ఆ తన్మయత్వంలో ఆ విశాలావరణంలో నా స్థానమేదోకూడ విచారించుకోలేదు. ఆ యింటికి అతిథిగా వచ్చానా, గృహిణిగా వచ్చానా లేక చెలినై వచ్చానా యివి యేవీ మనసుకు తట్టలేదు. అతని హృదయానికి తల నాన్చి పరవశమైపోతున్నాను. అత నలాగే ఆనందంలోమునిగిపోయినాడు. ఇరువురమూ ప్రపంచాన్నే మరచిపోయినాము.

ఎవరో కిలకిలా నవ్వారు. అదరిపడి తలయెత్తి చూశాను. ఆ నీలిఅద్దాలమేడలో నీలాకాశంలోని నక్షత్రాలలాగా

తళతళా మెరిసిపోతున్నారు. అబ్బా, యెంతమందో! అందరూ నన్ను హేళనచేస్తూన్నట్లుంది. చంద్రుడు తెల్లపోయి దిగులుగా చూస్తున్నాడు.

'వాళ్ళందరూ యెవరు' మధనపడి మధనపడి చివరకు ధైర్యం తెచ్చుకొని అడిగాను. చంద్రుడు శాంతంగా జవాబు చెప్పాడు: 'అందరూ నా మిత్రులు, నా సహచరులు' ఆశ్చర్యంవేసింది. సహచరులా! ఇంతమందితో పరిచయం వున్నట్లు యెప్పుడూ చెప్పలేదే!

'అందరూ నీ దగ్గరే వుంటారా?' అనుమానిస్తూ అడిగాను.

'ఎప్పుడూ నాతోకూడా నే వుంటారు. నన్ను విడిచిపెట్టి ఒక క్షణమైనా వుండలేరు.

నీలిఅద్దాలలోనిరంగు నా ముఖమంతా ఆవరించింది. ప్రపంచంలోవున్న దిగులంతా ఒక్కసారిగా నన్ను చుట్టుకొన్నది. ఇంతమందిమధ్య నే నెవర్ని, నా కేమిస్థానమున్నదిక్కడ--ఆఖరు ప్రయత్నంగా అడగలేక అడగలేక అడిగాను.

'వాళ్ళందరూ అంటే నీకు చాలా యిష్టమా?'

'ఆ! చాలా యిష్టం.'

నా క్రింద భూమిపగిలి నేను పాతాళానికి క్రుంగిపోతున్నట్లనిపించిది.

హృదయం వేసవియెండవలె కనలిపోతున్నది. ఇంతమంది యిష్టమైనవాళ్ళుండగా నేనెందుకు కావలసివచ్చాను? దీనికి జవాబులేదు. ఇది నా కప్పుడు అర్థంకాలేదు. ఎప్పుడూ

అర్థంకాదేమో! ఎక్కడో విదేశాలలో ఆప్తులందరికీ దూరమై విపరీతానుభవాలమధ్య వున్నట్లనిపించింది. తీరనిబెంగ ఆవహించింది. అమ్మ నాకోసరం ఎంత బాధపడుతున్నదో! కొలనులో పూవులన్నీ నన్ను 'కలువరాణీ కలువరాణీ' అని యెంతగా ప్రేమిస్తాయి. అందరికీ దూరమైపోయినానుగదా అని దుఃఖం పొర్లుకొచ్చింది.

'చంద్రా నేను వెళ్ళిపోతున్నాను. ఇంతమందివుండగా నీకు నా అవసరం యేమున్నది. అమ్మకు నేను చాలా అవసరం.' 'వీరందరితో కలిసిమెలిసి వుండలేకపోతే వెళ్ళవచ్చును.' ఎక్కడా విచారపడుతున్నట్టుగాకూడా కనపడలేదు. ఇంతమందితో కలిసి యెట్లా వుండగలను? అందరూ ప్రతి నిమిషము నాయెదుట తిరుగుతూ నన్ను వెక్కిరిస్తూవుంటే అంతా యెట్లా మరచిపోగలను? చంద్రుడు, నేను తప్ప యింకెవరూ లేరని యెట్లా అనుకోగలను? 'నేను పోతున్నాను'

చంద్రుడు మాట్లాడలేదు.

వాడిన పూవువలె నేలకు రాలిపోయినాను.

నిద్రలేచేసరికి అమ్మవడిలో వున్నాను. అమ్మ తల నిమురుతూ వున్నది. ఆమెకళ్ళవెంట నీళ్ళుకారుతూవున్నవి. 'అంతా మరచిపో తల్లీ' అన్నది. అంతా మరచిపోవటం యీ జన్మలో సాధ్యంకాదు. చంద్రుడు ప్రతినిమిషం నా యెదుటనే వున్నాడు. సాయంత్రంవేళ పొదలమాటునవుండి దీనంగా చూస్తాడు. నడిరాత్రివేళ మబ్బులమధ్యనుండి ఆదుర్దాగా తొంగిచూస్తాడు. నేను యెక్కడికి వెళ్ళినా నాతో

కూడానే వుంటాడు. అమ్మతో సముద్రస్నానానికి వెళ్ళాను. కెరటాలమీద తేలిపోతూన్నాడు చంద్రుడు. అయితే అతనికీ నాకూ వేయిమైళ్ల దూరం. ఇంక యెప్పటికీ కలుసుకోలేనేమో! చంద్రునికి దూరమైపోయిననాటినుంచి నా హృదయంలో యేదో అపశ్రుతి కలిసిపోయినది. ఎంత తియ్యని సంగీతమైనా యేదో అపశ్రుతి. చల్లని గంగాజలంలోకూడా యేదో వేడిమి; మధువులోకూడా యేదో చిరుచేదు. ఈ జీవితమింతేనేమో!